## విశ్వరూప మహా పాదయాత్రకు ఆహ్వానం



ఎమ్మెల్యే బండ్లను ఆహ్వానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గద్వాల అర్బన్ అక్టోబర్ 4: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అక్టోబర్ 7న చేపట్టనున్న విశ్వరూప మహా పాదయాత్ర అలం పూర్ నుంచి హైదరాబాద్ వరకు కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ క్రమంలో పాదయాత్రకు రావాలని కోరుతూ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో బుధవారం కలిశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విజయ్, కుర్మన్న, రాజేశ్, పరశురాం, సుందర్‌రాజ్, డేవిడ్, ఇమానుయేల్ తదితరులు ఉన్నారు.

## బావిలో మొసలి పట్టివేత

గట్టు, అక్టోబర్ 4: మండలంలోని తుమ్మల చెర్వు శివారులోని నవీన్‌రెడ్డి వ్యవసాయ బావిలో మొసలి బుధవారం కనిపించింది. కాగా గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు దాన్ని తాళ్లతో బంధించారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు అక్కడికి చేరుకుని మొసలిని స్వాధీనం చేసుకున్నారు. కాగా మొసలి ఆ బావిలో చాలా కాలం నుంచి ఉందని చెబుతున్నారు. బావి వద్దకు నీరు తాగడానికి వచ్చిన పలు గొర్రెలను మొసలి చంపి తిన్నదని తెలిపారు.

## ఎనిమిది గంటల పని అమలు చేయాలి



సమ్మె నోటీసును అందజేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

గట్టు, అక్టోబర్ 4: సమస్యల పరిష్కారం కోసం తపాలా ఉద్యోగులు నిర్వహించిన ఒక రోజు సమ్మె బుధవారం విజయవంతమైంది. ఒకరోజు సమ్మెతో పోస్టల్ లావాదేవీలు ఆగిపోయాయి. ఈ సందర్భంగా పోస్టల్ ఉద్యోగులు మాట్లాడుతూ 8గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టి, పెన్షతోపాటు అన్ని ప్రయోజనాలు కల్పించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీలను రూ.5లక్షలకు పెంచాలన్నారు. టార్గెట్‌లు, మేళాల రూపంలో ఉద్యోగులను వేధించవద్దన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు తిమ్మప్ప, మల్లేశ్, ప్రాణేశ్‌రావు, చంద్రమోహన్, పరమేశ్వరం గౌడ్, సాయిక్రిష్ణ పాల్గొన్నారు.

# చేనేతకు జీవం పోసిన ప్రభుత్వం

◆ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



చేనేత కార్మికులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, అక్టోబర్ 4: చేనేత వృత్తికి జీవం పోసి రాష్ట్రంలో వారికి అండగా నిలిచిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేనేత కార్మికులతో ఎమ్మెల్యే సమావేశమై మాట్లాడారు. చేనేత కార్మికుల కోసం దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని చెప్పారు. గద్వాల చేనేత చీరలకు ప్రసిద్ధి. ఇక్కడి చేనేత కార్మికులు నేచిన చీరలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయన్నారు. ఈ సందర్భంగా జాతీయ చేనేత కార్మికుల నూతన క్లస్టర్లు గద్వాల, గట్టును ఎంపిక చేశారన్నారు. అనంతరం డప్ పద్ధతిలో క్లస్టర్‌లోని సభ్యులను ఎమ్మెల్యే సమక్షంలో ఎంపిక చేశారు. ఎంపికైన సభ్యులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం చేనేతమిత్ర, చేనేత బీమా, త్రిఫ్ట్ తదితర పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. చేనేత కార్మికులు గద్వాల జిల్లాలో మొత్తం 2,500 మంది తమ మగ్గాలను జియోట్యాగింగ్ చేసుకోవడం వల్ల వారికి ప్రభుత్వం నుంచి అనేక సబ్సిడీలు అందుతున్నాయన్నారు. మున్సిపల్ చైర్మన్ కేశవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. కార్మికులు ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చే అవార్డులకు గద్వాల చేనేత కార్మికులు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ విజయ్‌కుమార్, కౌన్సిలర్లు మురళి, శ్రీమన్నారాయణ, నాగిరెడ్డి నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, గోవిందు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా

ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గట్టు మండలంలోని మిట్టదొడ్డికి చెందిన బీజేపీ నాయకుడు వీరేశ్‌శెట్టి ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలిగినా పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌పై అవగాహన

వడ్డేపల్లి, అక్టోబర్ 4 : మున్సిపాలిటీ కేంద్రం శాంతినగర్‌లోని లక్ష్మీనారెడ్డి బీఈడీ కళాశాలలో బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధులు అరవింద్, శివారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని, బ్యాంకింగ్ రంగంలో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, పర్యవేక్షకులు నాగేశ్వర్ రెడ్డి, అధ్యాపక బృందం విద్యార్థులు ఉన్నారు.

## ఆర్డీఎస్ ఆనకట్టకు వరద

అయిజ, అక్టోబర్ 4: కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద కొనసాగుతోంది. బుధవారం 2,357 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 1,800 క్యూసెక్కులు నమోదైంది. ఎగువ నుంచి వచ్చే వరద ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 537 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు ఆర్డీఎస్ డీఈ శాంతరాజు తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.4 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 3,850 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 9,737 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 53.726 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి గాను, ప్రస్తుతం 1617.16 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు?

## ప్రశాంతంగా గ్రామసభ



మద్దూరులో గ్రామ సభ నిర్వహిస్తున్న సర్పంచ్

మానవపాడు: అక్టోబర్4: ఇళ్ల పట్టాలు అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం బుధవారం మండలంలోని మద్దూరులో గ్రామసభ నిర్వహించారు. పోలీస్ బందోబస్తు మధ్య, సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తాసీల్దార్ జుబేర్ మైనోద్దీన్, డిప్యూటీ తాసీల్దార్ ధరణిషా, గిర్దావర్ రజనీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో రమణారావు, ఎంపీపీ అశోక్‌రెడ్డి హాజరయ్యారు. వరదలో నష్టపోయిన వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు గాను ప్రభుత్వం భూమిని సేకరించినా, పంపిణీ చేయలేదని ఇటీవల గ్రామస్తులు, సర్పంచ్, ఎంపీపీలు విడివిడిగా కలెక్టర్‌ను కలిసి, సమస్యను విన్నవించారు. ఈ మేరకు గ్రామసభ నిర్వహించాలని, దరఖాస్తులు స్వీకరించి, గ్రామసభ తీర్మానం చేసి జాబితా పంపాలని సూచించారు. ఈ మేరకు బుధవారం 515 మంది ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తులు అందించారు. ఈ తీర్మానం కాపీని కలెక్టర్‌కు పంపుతామని సర్పంచ్ తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

గట్టు, అక్టోబర్ 4: నీతి ఆయోగ్ అస్పిరేషన్ బ్లాక్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సీడీపీఓ కమలాదేవి మండలంలోని రాయాపురం, గట్టులోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సందర్శించారు. పిల్లల ఎత్తు, బరువును నమోదు చేసే కార్యక్రమాలను పరిశీలించారు. చిన్నారులకు అన్నప్రాశన చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకటరావమ్మ, ఉమామహేశ్వరి, సుజాతమ్మ, రాజేశ్వరి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 4,89,945మంది ఓటర్లు



రాజకీయ పార్టీల నాయకులకు ఓటరు జాబితా కాపీ అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

గద్వాల, అక్టోబర్4: జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 4,89,945 మంది ఓటర్లు ఉన్నారని, రెండు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌అన్నారు. బుధవారం తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు తుది జాబితా ప్రచురించినట్లు చెప్పారు. బుధవారం విడుదల చేసిన జాబితా ప్రకారం గద్వాల(79) నియోజకవర్గంలో మొత్తం 2,53,869 మంది ఉన్నారని తెలిపారు. వారిలో పురుషులు 1,24,763మంది, మహిళలు 1,29,096మంది, అలాగే అలంపూర్(80) నియోజకవర్గంలో 2,36,076 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,16,989మంది, మహిళలు 1,19,080 మంది ఉన్నారని తెలిపారు. వీరితో పాటు రెండు నియోజకవర్గాల్లో ఎన్‌ఆర్‌ఐలు 6, థర్డ్ జెండర్ 17 మంది ఉన్నారని చెప్పారు. వీరందరికీ కలిపితే 96మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారన్నారు. ఈ జాబితాను కలెక్టర్, రెవెన్యూ డివిజనల్, తాసీల్దార్ కార్యాలయాలతో పాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచుతామని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓటరు జాబితా కాపీని అందజేశామన్నారు. జిల్లాలో ఇంకా ఎవరైనా అక్టోబర్1 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఉండి, ఓటర్ జాబితాలో పేర్లు లేకుంటే వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ముగింపు నాటికి ఓటరుగా నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు పీఏసీసీఎస్ చైర్మన్ సుభాన్, వెంకటస్వామి, శివరాజు, పరమేశ్వర్‌గౌడ్, తిరుపాల్, తరుణ్‌కుమార్ ఉన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

జిల్లాలో రైతులు పండించిన పత్తి కొనుగోలుకు సీసీఐ ద్వారా రెండు పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాసులు చెప్పారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ హాల్‌లో వ్యవసాయ, మార్కెటింగ్, పోలీస్, ట్రాన్స్‌పోర్టు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో పత్తిసాగు ఎక్కువగా ఉందని, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించకుండా జిల్లాలోనే సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తున్నామన్నారు. గద్వాలలో శ్రీబాలాజీ కాటన్ జిన్నింగ్ ప్రాసెసింగ్ మిల్లు, అలంపూర్ చౌరస్తాలో శ్రీవరసిద్ధి వినాయక జిన్నింగ్ మిల్లులో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ అవకాశం పత్తి పండించే రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మద్దతు ధర క్వింటాకు రూ.7,020 ఉందని తెలిపారు. రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో అధికారులు గోవింద్‌నాయక్, పుష్పమ్మ, పురుషోత్తంరెడ్డి, రవి, ఎల్లస్వామి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.

NT-310380-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified 4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line 50/- Only
For Advertisement Enquiry Please Contact...
9182777641
9182777654
9182777794